# వెలుగు



-వి.వి. రమణారావు

అరుణోదయ మయింది. ట్రావెలర్స్ బంగళా వరండాలోకి వచ్చి ఒళ్ళు విరుచుకున్నాను. బాలభానుని బంగారు కిరణాలు విస్తరించుకుంటూ వచ్చి చెట్టుచెట్టునీ, పుట్టపుట్టనీ కౌగిలించు కుంటున్నాయి. మంచుతో తడిసిన గడ్డిమీది నీటి బిందువులు ముత్యాల్లా ఛమక్ ఛమక్ మంటున్నాయి. కొండలూ, లోయలూ పసుపు చీర కట్టిన నూతన వధువులా మెరిసిపోతున్నాయి. ఉండి ఉండి చల్లగాలి రివ్వున కొడుతూంది. గాలి వీచినప్పుడు చెట్ల చిగురులు అందమైన జవ్వని ముఖం మీద ముంగురులు కదలాడినట్టు మనోహరంగా కదులుతున్నాయి. ఒత్తుగా పెరిగిన గడ్డిపూలు గాలి వీచినప్పుడల్లా ముగ్ధ చెక్కిళ్లలో నునుసిగ్గు దొంతరలు దొర్లినట్టు దొర్లిపోయి, మళ్లీ నిటారుగా నిలబడుతున్నాయి. రకరకాల పక్షులు చేసే ధ్వనులు మంద్రస్థాయిలో వినపడే వాద్య గోష్ఠిలా మనోహరంగా వినిపిస్తున్నాయి. ఎదురుగా లోయ గంభీరంగా కనిపిస్తూంది. లోయ అంతా పొగ మంచు అల్లుకుని ఉంది. ప్రకృతిఅంత మనోహరంగా కనిపిస్తూ ఉంటే, లోపలికి పోబుద్ధి కాలేదు, వరండాలోనే ఉన్న ఒక కుర్చీ దగ్గరకు లాక్కుని కూర్చున్నాను.

'నాయర్!' అని పిలిచాను. నా పిలుపు నోట్లో ఉండగానే నాయర్ పొగలు కక్కుతూన్న వేడి వేడి కాఫీ కప్పు తీసుకొచ్చి నా ఎదురుగా పెట్టాడు. నాయర్ వేపు ఆప్యాయంగా చూశాను. ఈ అడివి కాని అడివిలో నాయర్ లేకపోతే నే నేమై

పోయి ఉండేవాడినో అనిపించింది. నా మనసులో ఊహ పసికట్టాడో ఏమో, చిన్నగా నవ్వి లోపలికి వెళ్ళిపోయాడు. నాయర్‌కి పొగడ్తలంటే కిట్టదు. అందుకే నాయర్ అంటే నా కిష్టం.

నేనీ ప్రాంతానికొచ్చి రెండేళ్ళవుతూంది. ఆర్కియాలజీ డిపార్టుమెంటు ఆఫీసర్ని అయ్యాక నా జీవితం అంతా కొండల్లోనూ, అడవుల్లోనూ గడిచిపోతూంది. రెండేళ్ళ క్రితం కట్టెలు కొట్టుకునే వాళ్ళు ఈ ప్రాంతాల్లో కట్టెలకోసం తిరుగుతూంటే ఒక చోట రెండు విగ్రహాలు దొరికాయి. వాటి వివరాలు సేకరించిన తరవాత ఇంకా ఈ ప్రాంతాల్లో చరిత్రలో మరుగుపడిపోయిన శిథిలాలెన్నో దొరకవచ్చని నిపుణులు నిర్ణయించారు. అవి వెలికే బాధ్యత ప్రభుత్వం నా మీద ఉంచింది. ఈ రెండేళ్ళుగా సుమారు రెండు వందల తుంది పనివాళ్ళతో తవ్వకాలు సాగిస్తే చాలా శిథిలాలు బయట పడ్డాయి. ఆ శిథిలాల్లో స్థూపాలూ, శిలా విగ్రహాలూ, భవనాలూ— అన్ని రకాలూ ఉన్నాయి. తవ్విన కొద్దీ బయటపడే వాటిని చూస్తే ఎవరికైనా ఆశ్చర్యం కలగక మానదు. ఏదో ఒకనాడు ఈ కొండల్లో, కోనల్లో జనం నివసించేవారు. వారికి ఒక రకమైన జీవన విధానం ఉండేది. కాలక్రమాన వారు అంతరించిపోయాక అవి మరుగున పడిపోయి, ఈ నాడు బయటపడుతున్నాయి. మానవుడు కాలంతో పరుగుతీసి, సృష్టితో ఎంత పోటీ చేసినా, ఒకనాటికి ఆ సృష్టిలోనే లీనమయిపోక తప్పదనే సత్యానికి ఈ శిథిలాలే సాక్ష్యం. ఇలాంటి అంతరించిపోయిన జీవన విధానాలు, మరుగుపడిపోయిన శిథిలాలు ఈ సృష్టిలో ఇంకెన్ని ఉన్నాయో?

గడిచిపోయిన చరిత్ర మీద ప్రతి మనిషికీ ఎంతో కొంత ఆసక్తి ఉంటూనే ఉంటుంది. ఆ చరిత్ర గురించి తెలుసుకోవాలన్న ఉత్కంఠ కలుగుతూనే ఉంటుంది. అందుకే ఇక్కడ శిథిలాలు బయట పడ్డాక ఇక్కడ చూడ్డానికొచ్చే మనుష్యుల సంఖ్య రోజు రోజుకీ పెరగసాగింది. జనం రావడం వల్ల వాళ్ల వసతి సదుపాయాలకోసం 'ట్రావెలర్స్ బంగళా' కట్టవలసి వచ్చింది. నాలాంటి బ్రహ్మచారికి 'ట్రావెలర్స్ బంగళా' కల్పతరువులా అయింది. నా పెర్మనెంటు మకాము అందుకే ఇక్కడికి మార్చేశాను.

క్రమంగా ఎండ చిక్కపడసాగింది. ఎండలో కొంచెం చురుక్కుమంటూ ఉంది. చేతి గడియారం చూశాను. ఎనిమిదయింది. 'అరె! ఆలస్యమయిపోయిందే!' అనుకుని బాత్‌రూమువేపు నడిచాను.

స్నానం చేసి వచ్చేసరికి ఫలహారం సిద్ధంచేసి పెట్టాడు. వేడి వేడి పూరీలూ, కూరా తిని, కాఫీ తాగి షెడ్డు దగ్గరికి వెళ్ళి జీపుని బయటికి తీశాను. జీపుని ముందుకి పోనిద్దా మనుకుంటూండగా నాయర్ వచ్చాడు. "భోజనం?" అన్నాడు. "పంపించు" అన్నాను. జీపు బయలుదేరింది.

అలవాటయిన రోడ్డు మీద చేతులూ, కాళ్ళూ యాంత్రికంగా పని చేస్తూ జీపుని నడిపిస్తున్నాయి. సరిగా నడవనిదీ, నేను నడపలేనిదీ ఒకటే! అది నా మనసు. ఎప్పటిలా ఇప్పుడు కూడా అది దారి తప్పింది.

చదువుకునే రోజుల్లో నేను చాలా అల్లరి చేసే వాణ్ణి. నా చుట్టూ ఎప్పుడూ ఓ పది మంది స్నేహితు లుండేవారు. కాలేజీలో పాఠాలు సరిగ్గా వినేవాళ్ళం కాదు. ఎవరు చెప్పిందీ ఒప్పుకునేవాళ్ళం కాదు. జీవితం ఎప్పుడూ గలగల పారే సెలయేరులా ఉండేది. స్తబ్దత అనేది మాకు తెలియని విషయం. ఒక్క క్షణం కాలూ, చెయ్యీ ఊరుకునేవి కావు. జరిగే పాఠాల మీద శ్రద్ధ కనపరచకపోయినా, స్వతహాగా కొంచెం తెలివితేట లుండటం వలన పరీక్షలు మాత్రం గట్టెక్కేస్తూ ఉండేవాడిని. అలాంటి సమయంలో ఒక రోజు సూర్యంమామయ్య నాన్నగారితో కలిసి హాస్టల్లో ఉన్న నా దగ్గరకు వచ్చాడు.

"ఒరే, సారథీ! వరలక్ష్మిని నీ కిద్దామనుకుంటున్నాంరా! ఓ మ్మా సారి వచ్చి చూడు" అన్నాడు. వరలక్ష్మిని నేను పదో ఏడు ఉన్నప్పుడు గాబోలు చూశాను. ఆ తరవాత మళ్ళీ చూడలేదు. నాన్నగార్ని కూడా సూర్యంమామయ్య తోడు తీసుకువచ్చాడు కాబట్టి, అది ఆయన ఉద్దేశం కూడా అయి ఉండాలి.

"సరే, చూస్తాను!" అన్నాను. ఒక మంచి రోజు చూసి వరలక్ష్మిని చూడడానికి వెళ్ళాను. సూర్యంమామయ్య ఇంట్లో అడుగు పెడుతూనే కూతుర్ని పిలిచాడు. వరలక్ష్మి వచ్చింది. నాకు కళ్ళు చెదిరాయి. 'వరలక్ష్మిలో ఇంత అందమెప్పుడు వచ్చింది?' ఆరేళ్ళు ఒక వ్యక్తిలో ఇంత మార్పు తీసుకు రాగలదా? వరలక్ష్మి నన్ను చూసి నిలబడిపోయింది. "సారథి బావమ్మా!" సూర్యంమామయ్య పరిచయం చేశాడు. వరలక్ష్మి చిన్న మందహాసం చేసి లోపలికి వెళ్ళిపోయింది. నాకు తల కొట్టేసినట్టయింది. నాతో వరలక్ష్మి మాట్లాడుతుం దనుకున్నాను. నన్ను చూడగానే 'రా, బావా!' అంటూ చెయ్యి పుచ్చుకుని లోపలికి తీసుకువెళుతుం దనుకున్నాను. గలగలలాడుతూ కబుర్లు చెబుతుం దనుకున్నాను. అవేవీ జరగక పోయేసరికి నాకు నిరాశ కలిగింది. వరలక్ష్మి కెందు కంత అహంకారం? సూర్యంమామయ్య పరిస్థితి అంత బాగులేదు. చాలా చితికిపోయి ఉన్నాడు. వరలక్ష్మి కాక అతని కింకా ఇద్దరు కూతుళ్ళు ఉన్నారు. ఇప్పుడు నేను వరలక్ష్మిని చేసుకుంటే మామయ్యకది వరమే అనుకోవాలి. అలాంటిది వరలక్ష్మికి ఎందు కంత నిర్లక్ష్యం?' ఆ తరవాత నా ఆలోచనలు నాకే అసందర్భంగా తోచాయి. నేను తనని పెళ్ళి చేసుకోబోతున్నానని తెలిసిన తరవాత వరలక్ష్మి నాతో చెయ్యి పట్టుకునేటంత చనువుగా ఎలా ఉండగలదు? బహుశా సిగ్గుపడి వెళ్ళిపోయి ఉంటుంది. ఆ పూటకి ఎలాగో ఒక లాగ నా మనసుకి నేనే సమాధానం చెప్పుకున్నాను. ఆ తరవాత నే నక్క డున్న మూడు రోజుల్లోనూ వరలక్ష్మి నాతో మాట్లాడలేదు. నాతోనే కాక ఇంట్లో వాళ్లతో కూడా అతి నిర్లిప్తంగా ఉండటం చూశాను. ఆ మూడు రోజులూ నాకు ముళ్ళమీద ఉన్నట్టు గడిచాయి. తిరిగి వచ్చాక నాన్నగారు నా అభిప్రాయం అడిగారు. వరలక్ష్మి నాకు నచ్చలేదని నిర్మొహమాటంగా చెప్పాను. కారణ మడిగారు నాన్నగారు.

"నాతో కలిసిమెలిసి, సరదాగా కాలక్షేపం చేసే పిల్ల కావాలి కాని, వరలక్ష్మి లాంటి 'స్తబ్దు' నాకక్కరలే దన్నాను. నాన్నగారు నన్ను బలవంత పెట్టలేదు. కాని, "వరలక్ష్మిలాంటి ఉత్తమమైన పిల్ల దొరకడం అంత సులభం కాదు! ఆలోచించుకో!" అని మాత్రం అన్నారు. నేను వెనక్కి తిరిగి వచ్చేశాను. నేను ఉద్యోగంలో చేరి మూడేళ్లయింది. రెండేళ్ళ క్రితం వరకూ వరలక్ష్మి సంగతి ఆలోచించమని సూర్యంమామయ్య ఉత్తరాలు రాస్తూ ఉండేవాడు. నేను జవాబు లిచ్చే వాడిని కాదు. ఇంక అనవసర మనుకున్నాడో ఏమో కాని, సూర్యంమామయ్య తరవాత ఉత్తరాలు రాయడం మానుకున్నాడు. వరలక్ష్మికి ఇంకా పెళ్ళి కాలేదనిమాత్రం నాకు తెలిసింది.

గుడ్డివాడికి, చూపు ఉన్నవాడికి చీకటిలో కనిపించేది శూన్యమే. ఆ చీకటిలో అగ్గిపుల్ల వెలిగించి కళ్ళున్నవాడు వెలుగుని చూడగలడు. కాని, గుడ్డివాడికి అప్పుడూ చీకటే. వెలుగులో వెలుగులా జీవితాన్ని మలచుకోడం మన చేతుల్లోనే ఉంది. ఆ సత్యాన్ని గుర్తించడానికి మంచిని పంచిపెట్టినప్పుడు పొందే ఆనందానుభూతిని సాధించగలిగినప్పుడే.

వరలక్ష్మిని వద్దన్నాను గాని, వరలక్ష్మి రూపం నా మనః ఫలకం మీద వేసిన ముద్రని మాత్రం చెరపలేకపోయాను. ఎన్నోసార్లు వరలక్ష్మి జ్ఞాపకానికి వచ్చేది. కాని, ఆమె చేతల్లో, మాటల్లో కనపరిచిన ఉదాసీనత గుర్తుకి వచ్చి వరలక్ష్మి బొమ్మని మనసులోంచి బలవంతంగా తొలగించడానికి ప్రయత్నించే వాడిని. చివరికి అది సాధ్యపడక వరలక్ష్మినే ఇంకో విధంగా మనసులో చిత్రించుకునే వాడిని. చిట్టచివరికి నవ్వుతూ, గలగలలాడుతూ, అందర్నీ నవ్విస్తూ తిరిగే నే నూహించుకున్న వరలక్ష్మి నా మనసులో నిలిచిపోయేది. చిత్ర మేమిటంటే, ఏ స్తబ్దత వల్ల వరలక్ష్మిని కాదన్నానో నేను, ఆ స్తబ్ధ జీవితంలోకే విధి నన్ను విసిరేసింది. గడిచిన రెండేళ్లుగా ఈ కోనల్లో, కొండల్లో యాంత్రికమైన జీవితం గడిపాక మనసు మొద్దుబారిపోయింది. చైతన్యం కలగడం లేదు.

జీపు బ్రేక్ 'పెడలు' గట్టిగా నొక్కాను. సడెన్ బ్రేక్‌తో జీపు ఆగింది. ఊహలకి కూడా బ్రేక్ పడింది. ఎదురుగా ఒక ఇరవయి అయిదేళ్ల యువతి చెయ్యి అడ్డం పెట్టి నిలుచుని ఉంది. ఆమె చక్కదనానికి మితి లేదు. ఎర్రటి చీర, అదే రంగు బ్లౌజు, మెడచుట్టూ మఫ్లరు కప్పుకుంది. చెవులకి ముత్యాల దుద్దులు. పచ్చటి శరీరం. ఈ కొండల్లో, కోనల్లో ఇంత అపురూప సౌందర్యం ఎలా వచ్చి పడింది? నా కళ్ళు అలాగే నిలిచిపోయాయి. ఆమె జీపు దగ్గరికి వచ్చింది.

"మిస్టర్!"

"సారథి" అన్నాను.

"సారథి గారూ! మీ రిక్కడ పని చేస్తున్నా రనుకుంటాను." ఆమె కంఠం




వినగానే ఉదయం నేను విన్న కోయిల కూతలు జ్ఞాపకానికి వచ్చాయి.

"అవును! నే నిక్కడ పని చేస్తున్నాను. మీరు ..."

"నేను ఇక్కడ శిథిలాలు చూడ్డానికి వచ్చాను. నాకు చిన్నప్పటినుంచీ అడవు లన్నా, కొండలన్నా బలే ఇష్టం. నా కిక్కడ దారులూ అవీ అసలు తెలియవు. మీ రేమైనా సహాయం చేస్తారేమో అని మిమ్మల్ని ఆపాను. అంతే" అంది.

ఆమె వేపు విస్మయంగా చూశాను. 'ఎక్కడో పరాయి దేశంలో, ముక్కూ మొహం ఎరగని వ్యక్తితో ఈమె ఎంత ధీమాగా మాట్లాడుతూంది? ఎంత చొరవ, ఎంత సాహసం ఉన్నాయి ఈమెకి?' అనుకున్నాను. 'నేను ఆమెని మోసం చెయ్యను అనే ఊహ కలిగేటట్టు ఉందా నా ఆకారం?' ఒక్కసారి నావేపు నేను చూసుకున్నాను.

"ఫరవాలేదు లెండి! నేను ఎం. ఏ. వరకూ చదివాను. మనుషుల మీద నాకు బాగా నమ్మకం ఉంది. మీరంటే నాకు భయం లేదు!" అంది ఆమె నవ్వుతూ.

ఒక్కసారి గతుక్కుమన్నాను. ఈమెకి చొరవ, సాహసమే కాదు, మనుషుల అంతరంగాల్లో ఏముందో తెలుసుకునే తెలివిని కూడా ఇచ్చాడు దేవుడు.

"మీరు 'సైకాలజీ' బాగా స్టడీ చేసినట్టున్నారు" అన్నాను నేను నవ్వి.

"లేదు లెండి! మనుషుల నర్థం చేసుకోవాలంటే 'సైకాలజీ' స్టడీ చెయ్య నక్కర లేదు. మొహాలు చూస్తే చాలు. నాకు తెలిసిన సైకాలజీ ప్రొఫెసర్ ఒకాయన ఉండేవారు. ఆయనకీ, ఆయన భార్యకీ ఒక్క క్షణం పడేది కాదు. జీవిత మంతా సైకాలజీ చెప్పిన ఆయనకి ఆయన భార్య సైకాలజీ మాత్రం అర్థం కాలేదు."

ఫకాలున నవ్వాను నేను. నా నవ్వు నాకే చిత్రంగా కనిపించింది. రెండేళ్లయిందేమో నేను అలా నవ్వి. "మీరు చాలా బాగా మాట్లాడతారు" అన్నాను.

"థాంక్స్! ఇంతకీ మీరు నన్ను నిలుచోబెట్టే మాట్లాడుతున్నారు. నాకు శిథిలాలూ అవీ చూపిస్తారా లేక ...?" ఆమె అడిగింది.

"ఓ ఎస్! నిరభ్యంతరంగా! ఎటొచ్చీ మీకు ట్రైమ్ ఉండాలి గాని" అన్నాను.

"సాయంకాలం ఆరింటివరకూ మీ రేం చూపించినా చూస్తాను. అప్పుడు మాత్రం కొండ దిగి వెళ్లిపోవాలి. జీపులో ఎక్కమంటారా?" అంటూ ముందుకి వచ్చింది ఆమె.

నాకు సందేహం కలిగింది. ఈమె ఎవరో నాకు తెలియదు. పెళ్లయిందో, లేదో? నా పక్కన కూచోమంటే ఏమను కుంటుందో? ఎందుకయినా మంచిదని "రండి! వెనకసీట్లో కూచోండి" అని చూపించాను.

"అక్కరలేదు. మీతోపాటు నేనూ ముందు సీట్లోనే కూచుంటాను. లేక పోతే మీరు చెప్పేది సరిగా ఫాలో అవ లేను" అని ముందుకి వచ్చి నా పక్కన కూచుంది. చిన్నతన మనిపించింది నాకు. అనవసరంగా తేలిపోయాను. తల వంచుకుని జీపు స్టార్టు చేశాను. 'ఈమెకి బహుశా పెళ్లయి ఉండదు. అయిఉంటే నా పక్కన ఎందుకు కూచుంటుంది? ఎలా అయినా మాటల్లో తెలుసుకోవచ్చు. తొందరపడి అడగడ మెందుకు?' జీపుని వెనక్కి తిప్పాను.

"మళ్లీ వెనక్కి పోతున్నారేం?" ఆమె అడిగింది.

"మరి ఈ రోజుకి మీకు కూడా భోజనం ఏర్పాట్లు చెయ్యద్దా?"

"అక్కరలేదు లెండి! ఈ పూటకి ఏదో తిని గడిపెయ్యగలను. మీకు మాత్రం భోజనం ఏర్పాటు చేసుకోండి."

"నా కెలాగా చేసుకుంటాను. మీ రలా మొహమాట పడకండి! మా బంగళా నించి ఏం కావాలన్నా నిమిషాల మీద వస్తుంది. అందులో నేను తెప్పించే భోజనం ఒకసారి తిన్నారంటే మళ్లీ మరిచిపోరు."

"అంతబాగావండతారా మీ ఆవిడ?"

జవాబు చెప్పకుండా ఆమె ముఖం లోకి చూశాను. ఈమె బహుశా నాకు పెళ్లయిందో, లేదో తెలుసుకుందామని అడగలేదు కదా ఈ ప్రశ్న? కాని, ఆమె ముఖంలో అలాంటి భావం కనిపించ లేదు. నిర్లిప్తంగానే ఉంది.

"ఓ ఫస్ట్‌క్లాస్‌గా!"

"అయితే మీ మిసెస్‌ని అభినందించాలి."

"ఎందుకో?"

"ఎందుకా? ఈ లోకంలో భార్యల వంటలు మెచ్చుకునే భర్తలు అతి కొద్దిగా ఉంటారు కాబట్టి."

"బహుశా మీ భర్తగారు మీ వంటను మెచ్చుకో రనుకుంటా?"

ఈ సారి ఆమె మాటల్లో నాకు దొరికిపోయింది. ఇప్పు డేం సమాధానం చెపుతుందో చూడాలి. ఆమె ముఖంలోకి పట్టి చూశాను. ఆమె నవ్వి, "మీ రను కున్నది తప్పే!" అని మళ్లీ బయటికి చూడ్డం మొదలెట్టింది. ఏది తప్పో నాకు అర్థం కాలేదు. 'అంటే ఆమె భర్త ఆమె వంటని మెచ్చుకుంటారనా? లేక ఆమెకి పెళ్లి కాలేదనా?' మొత్తానికి చాలా తెలివైనది.

"అన్నట్టు ముఖ్యమైనది అడగటం మరిచిపోయేను. మీ పేరు? ..." పేరు చెపితే పోనీ పెళ్లయిందో, లేదో కనుక్కోవచ్చు. కొందరు ఆడవాళ్లు తండ్రిపేరు కూడా చివర పెట్టుకుంటారు. కాని, ఈమె తండ్రిపేరు చివర పెట్టుకునే ప్రాంతపు స్త్రీలా లేదు. తెలుగువాళ్లే, ఎక్కడో ఇంకో ప్రాంతంలో చాలాకాలంనించే ఉండి ఉంటారు.

"నా పేరు అరుణ" అంది ఆమె ముక్తసరిగా. పేరునిబట్టి ఆమెకి పెళ్లయిందా, లేదా అన్నది తెలుసుకోవడం ఇంక దుర్లభం. అరుణ అనే పేరు ఎవరికయినా, ఏ ప్రాంతం వాళ్లకయినా ఉండచ్చు. ఇంక లాభం లేదు. ఆమెని అడిగెయ్యాల్సిందే.

"మీ వారు ఏం పని చేస్తూ ఉంటారు?" ఆమె ముఖం వేపు చూడకుండా స్టీరింగ్ వీలు మీద దృష్టి నిలిపి అడిగాను, నా ముఖంలో ఏ భావమూ కనిపించనీయకుండా. "ఈ ప్రశ్నకి జవాబు తర్వాత చెపుతా లెండి!" అంది. ఇంక మళ్లీ ప్రశ్నించలేదు నేను. బహుశా ఆ ప్రసక్తి తేవడం ఆమెకి ఇష్టం లేదేమో? కాని, ఎందుకో ఆమెకి పెళ్లయిందని అనుకోవడానికి నా అంతరాత్మ అంగీకరించలేదు.

జీపు బంగళా ముందర ఆగింది. "నాయర్!" అని పిలిచాను. నాయర్ వచ్చాడు. "చూడు! ఈ రోజు ఇద్దరికి సరిపడా భోజనం వర్క్ స్పాట్‌కి పంపించు! ఆలస్యమైనా ఉంచమని చెప్పు!" అని చెప్పాను. నాయర్ తల ఊపాడు. జీపుని మళ్లీ వచ్చిన తోవంటే బయలుదేరదీశాను. జీపు ఒక ఫర్లాంగు దూరం వెళ్లిగెట్టాక అరుణ — "మీ ఆవిడను నాకు పరిచయం చెయ్యలేదే?" అంది.

"మీరు చూడలేదా? ఇప్పుడు మాట్లాడానుగా!" అన్నాను.

అరుణ నవ్వింది.

"ఏం మీకు నచ్చలేదా మా ఆవిడ!" అన్నాను.

"నచ్చకేం? చాలా బాగున్నాడు. ఆ లుంగీ, ఆ బనీనూ, ఆ బట్టతలా..."

"చూడండి! కావలసినవన్నీ వేళకి చేసిపెట్టేది భార్యే అని మీ రనుకుంటే నాయర్ నాకు భార్యకన్నా ఎక్కువ. నిజంగా అతను లేకపోతే ఈ అడివిలో నే నేమయిపోయి ఉండేవాడినో మీకు తెలియదు. నిజంగా చాలా మంచివాడు అతను." నేను సీరియస్‌గా చెప్పడంవల్లనేమో అరుణ నవ్వడం మానేసింది.

జీపు 'వర్క్ స్పాట్' దగ్గరికి వచ్చింది.

"అరుణగారూ! ఇప్పుడు ప్రస్తుతం త్రవ్వకం ఇక్కడే జరుగుతూంది. మన భోజనం ఇక్కడికే పంపమని చెప్పాను. అందుకని ఇక్కడ ఉన్నవి భోజనం చేశాక చూడవచ్చని నా అభిప్రాయం. ఇంతకు పూర్వం తవ్వినవి ఇంకో మైలు దూరంలో ఉన్నాయి. అక్కడికి పోదామంటారా?"

"మీ ఇష్టం — అలాగే కానివ్వండి కాని, నేను మిమ్మల్ని ఒకటి అడగ దలుచుకున్నాను. ఈ గారూ, గీరూ—ఇలాటివి పేర్ల చివర పెడితే పేర్ల అందం పోతుం

దని నా అభిప్రాయం. నేను మిమ్మల్ని మిస్టర్ సారథీ అంటాను. మీరూ నన్నలాగే పిలవండి."

అమ్మయ్య! నాకు మరో మంచి అవకాశం దొరికింది. ఈ అవకాశం వథా పోనివ్వకూడ దనిపించింది.

"సరే! మీ ఇష్టం! కాని, మిమ్మల్ని మిస్ అరుణా అని పిలవ మన్నారా లేక..."

"ఏమీ అక్కరలేదు. అరుణా! అని పిలవండి చాలు." నా ప్రశ్న పూర్తవకుండా మధ్యలోనే తుంచేసింది. ఈమె మాటల్లో ఇంక దొరకదనిపించింది నాకు. జీపు స్టార్టుచేసి, కొండమీద వలయాకారంగా ఉన్న రోడ్డు మీద తిప్పి, పాత తవ్వకాల దగ్గరికి తీసుకు వచ్చాను. అరుణ కిందికి దిగింది. పది గంటలయిందేమో ఎండ చురుగ్గా వంటికి తగులుతూంది. చిన్నగా చెమటలు పొయ్యసాగాయి. అరుణ మెడచుట్టూ ఉన్న మఫ్లరు తీసేసింది. శంఖంలా ఉన్న మెడచుట్టూ ఒక్క లాకెట్ చెయిను మాత్రం ఉంది. నా కెందుకో మనసు తేలిక పడింది. అయితే అరుణకి పెళ్లి కాలేదన్న మాట. అరుణకి చెప్పాను!

"చూడండి! ఈ తవ్వకాల్లో బయట పడిన విగ్రహాలూ అవీ పధ్నాలుగో శతాబ్దం నాటివి. శిల్పకళను బట్టి, శిల్ప విధానాలను బట్టి వాటి కాలం నిర్ణయించబడింది. ఇలాంటివే ఈ కొండమీద మీకు మరో రెండు చోట్ల కనిపిస్తాయి. ఇందాకా వెళ్లామే, 'వర్క్ స్పాట్' అని చెప్పాను. అదొక స్థలం. వీటి గురించీ, వీటి చరిత్ర గురించీ పూర్తిగా చెప్పాలంటే ఇందులో ఎక్స్‌పర్ట్స్ మీకు చెప్పాలేగాని, నేను చెప్పగలిగేది చాలా తక్కువ. అందుకని నేను చెప్పడం బదులు మీ రేమైనా ప్రశ్న లడగండి, నాకు తెలిసినంతవరకూ జవాబులు చెపుతాను."

"సరే లెండి! చాలా వాటికి ఇక్కడే ఏవో రాసి పెట్టారు కదా! నేను చదువుకుంటూ పోతాను లెండి! మీకు ఇవన్నీ చూసి విసుగెత్తి ఉంటుంది. మీ రెక్కడయినా కూర్చోండి! నేను ఇవన్నీ ఒక టొకటే చూసుకుంటూ వస్తాను. నాకేం ప్రశ్న లడిగే జ్ఞానం ఇందులో లేదు లెండి" అని నా సమాధానం కోసం ఆగకుండానే అరుణ ముందుకి వెళ్లిపోయింది. నాకు కొంచెం ఆశాభంగం అయింది. అరుణతో కూడా ఉండి, అక్కడ ఉన్న విగ్రహాలు అన్నీ నేనే ఆమెకి స్వయంగా చూపిద్దా మనుకున్నాను. ఆ అవకాశం జారిపోయింది. 'ఫరవాలేదు. నేనూ వస్తా' నని వెంటపడితే ఏమయినా అనుకుంటుందేమో? చేసేది లేక అక్కడే ఒక బండరాయిమీద చతికిలపడ్డాను. అరుణ లేడిపిల్లలా గెంతుకుంటూ, రాళ్లను దాటుకుంటూ, విగ్రహాలు చూసుకుంటూ వెళ్లిపోతూంది. అక్కడ కూచుని అరుణని పరిశీలించడం మొదలెట్టాను. 'అసాధారణమైన సౌందర్యం అరుణది' అన్న ఊహ నా మనసులో మెదిలింది. నేను కాలేజీలో చదివే రోజుల్లో ఎంతో మంది అమ్మాయిలతో పరిచయం ఉండేది నాకు. కాని, నాకు ఇటువంటి సౌందర్యం ఎవరిలోనూ కనిపించలేదు. నా మనసులో ఇంకో విషయం కూడా తట్టింది. చూడగానే మనిషిలో మనోవికారం కలిగించి, గంగ వెర్రు లెత్తించే సౌందర్యం కాదు అరుణది. ఏదో ముగ్ధత్వం, మూర్తీభవించిన సొగసు ఆమెలో ఉన్నాయి. ఆమెని చూడగానే ఏదో చెప్పలేని అనుభూతి కలుగుతుంది. నా మనసులో వరలక్ష్మి మెదిలింది. వరలక్ష్మి కూడా ఇంత చక్కనిదే! కాని, వరలక్ష్మిలో కనిపించని ప్రత్యేకత ఏదో అరుణలో ఉంది. అది ఏమిటో మాత్రం అంతు పట్టలేదు. కన్ను ముక్కు తీరులను బట్టీ, వాటి పొందికనుబట్టీ చూస్తే అరుణదీ, వరలక్ష్మిదీ దాదాపు ఒకే అందం అని చెప్పవచ్చు. మరి అరుణలో ఉన్న ప్రత్యేకత ఏమిటి? ఎంత ఆలోచించినా నాకు అర్థం కాలేదు. ఇద్దరి గురించీ ఆలోచిస్తున్న నా మనసులో చివరికి వరలక్ష్మి తొలగిపోయి పూర్తిగా అరుణ ఆక్రమించుకుంది.

దాదాపు గంట అయిన తరవాత అరుణ నా దగ్గరికి వచ్చింది.

"ఏమి టలా ముక్కు మూసుకుని కొంగజపం చేస్తున్నారు? ఆలస్యం చేశానా?" నేను మాట్లాడలేదు. ఆమె వేపు చూస్తూ కూర్చున్నాను. ఆమె నిలుచున్న తీరులో వెయ్యి అజంతా శిల్పాల్లో ఉండే ఆకర్షణ ఉంది. నే నలా చూడ్డం ఇష్టం లేక కాబోలు అరుణే నాలు గడుగులు ముందుకి వేసి, "పదండి, పోదాం!" అంది.

నేను లేచి ఆమె ననుసరించాను. కొంతదూరం జీపులో వెళ్లిన తరవాత రెండో ప్రదేశానికి చేరాము. అరుణ దిగింది. నేను జీపు దిగలేదు.

"మీరు రారా?" అడిగింది అరుణ.

"ఎందుకు? మీరు చదువుకుంటూ పోతానన్నారు కదా!"

అరుణ నవ్వింది.

"ఫరవాలేదు రండి! ఇందాకా చదువుకుని వెళ్లాను గాని,కొంచెం బోర్ కొట్టింది. ఈ సారి మీరు రండి. మీకు తెలిసింది కూడా చెప్పచ్చు." నేను జవాబిచ్చేలోగా అరుణ వెనక్కి తిరిగి నడవడం మొదలెట్టింది. నా కదోలా అనిపించింది. ఏమిటి ఈ అమ్మాయి నన్ను శాసిస్తున్నట్టు ఉందే! తను రమ్మన్నప్పుడు నేను రావాలి, పొమ్మన్నప్పుడు పోవాలి కాబోలు. అయినా చేసేదేమీ లేక అరుణ వెనక బయలుదేరాను. అక్కడ ఉన్న శిథిలాలన్నీ చూసేసరికి ఒక అరగంట పట్టింది. తిరిగి వచ్చి జీపులో కూర్చున్నాము.

"ఎక్కడికి వెళదా మంటారు ఇప్పుడు?" అడిగాను.

"నాకేం తెలుసు? మీరే చెప్పండి. చూడవలసిన వన్నీ అయిపోయినట్టేనా?" అడిగింది అరుణ.

"ఇంక వర్క్ స్పాట్‌లో మిగిలినవి మాత్రం చూడాలి. మన భోజనానికి ఇంకా గంటన్నర టైము ఉంది. కొండకి అటువేపు ఓ చిన్న జలపాతం ఉంది. చూస్తారా?" అని అడిగాను.

"ఓ ఎస్! సాయంత్రం ఆరింటి వరకూ మీ రేం చూపించినా చూస్తానని చెప్పానుగా! పదండి, పోదాం!"

జీపు స్టార్టు చేశాను.

---

### శక్తి

**భౌతిక శక్తులకంటె ఆధ్యాత్మిక శక్తులుగొప్పవని, ప్రపంచాన్ని పాలించేవి భావనాశక్తులేనని గ్రహించిన వారంతా గొప్పవారే.**

—ఎమర్సన్

---

"మళ్లీ జీపులో ఎందుకు? ఇలా కొండ కడ్డంగా దిగి పోలేమూ?" అరుణ అడిగింది.

"దిగచ్చు! కాని, మీరు గోతులూ అవీ అడ్డం వస్తే దాటగలరా అని."

"నా గురించి మీ కా సందేహం అక్కరలేదు లెండి! నేను ఎలాంటి కొండల్నీ, గుట్టల్నీ అయినా దాటేస్తాను. అయినా, మీరు పక్కని ఉండగా నాకేం భయం?"

అరుణ జవాబు విని మనసులో నాకేదో సంశయం కలిగింది. 'ఈ అమ్మాయికి మొహమాటం అనేది లేనట్టుంది. నేను పక్కని ఉండగా తనకేం భయం లేదనడంలో ఆమె ఉద్దేశం? కొంపతీసి ఈ అమ్మాయి వన్నేమైనా 'ట్రాప్' చెయ్యడానికి రాలేదుకదా! మంచి ఉద్యోగాల్లో ఉన్న వాళ్లని చూడ్డానికి కాస్త ఎర్రగా బుర్రగా ఉన్న వాళ్లని మెల్లిగా పరిచయం చేసుకుని, వాళ్లని వలలో వేసుకునే ఆడవాళ్ల గురించి అప్పుడప్పుడు విన్నాను. ఈ అమ్మాయి ఒకవేళ అలా వచ్చిందా? కాని, నా ఊహకి మళ్లీ నాకే సిగ్గేసింది. నే నేమైనా పసిపిల్లవాణ్ణా ఆమెకి లొంగిపోవడానికి? అయినా, ఎందుకో అరుణ అలాంటిది అనుకోవడానికి నాకు మనస్కరించలేదు. ఇద్దరం కొండ దిగడం మొదలెట్టాము.

ఆ ప్రదేశాలన్నీ బాగా అలవాటయిన నాకన్నా, అరుణే సులువుగా కొండ దిగడం మొదలెట్టింది. ముళ్లకంచెల్నీ, తుప్పల్నీ అతి నేర్పుగా తప్పించుకుంటూ, అడ్డంగా ఉన్న రాళ్లను దాటుకుంటూ జరజర ముందుకి సాగిపోతూంది. రాను రాను నాకూ, అరుణకీ ఉన్న దూరం పెరగసాగింది. అలా వెళ్తూ వెళ్తూ అరుణ హఠాత్తుగా ఒకచోట నిలిచిపోయింది. రెండు నిమిషాల్లో నేనూ అరుణ దగ్గరికి చేరాను.

"అబ్బ! ఇక్కడ చాలా పెద్ద గొయ్యి ఉందే! ఎలా దాటడం?" అరుణ ముఖం చూసి నాకు నవ్వు వచ్చింది. అక్కడ ఉన్న గొయ్యి అంత పెద్దదేం కాదు. నేను సునాయాసంగా దాటగలను. అరుణకి కొంచెం కష్టం కావచ్చు. గొయ్యి నేను దాటేశాను.

"మిమ్మల్ని కూడా దాటించమన్నారా?" అవసరమైతే ఆమె నడుముని పట్టుకుని గొయ్యి దాటిద్దామనే ఉద్దేశంతో అన్నాను. నా ఊహ గ్రహించింది కాబోలు, "అక్కరలేదు లెండి! మీ చెయ్యి అందించండి! చాలు" అంది. నేను చెయ్యి అందించాను. నా చేతిలో చెయ్యి వేసి గట్టిగా పట్టుకుని ఒక్కసారి గోతిమీదుగా నావేపుకు గెంతేసింది. నాకు ఒళ్లు ఝల్లుమంది. దూకిన వెంటనే అరుణ నా చేతిలోంచి తన చేతిని లాగేసుకుంది. ఆ స్పర్శ నరనరాల్లోనూ నాకు తిమ్మిరెక్కించింది. ఆ చేతిని అలాగే పట్టుకుని హృదయానికి హత్తుకుని ఉండిపోవాలనిపించింది. అరుణ 'థాంక్స్' అని చెప్పి ముందుకి పరుగెట్టింది. నాకు స్పృహ కలిగింది. నా మనస్సులో ఒక కోరిక కలిగింది. 'ఈ స్పర్శవల్ల కలిగిన ఆనందం నాకు శాశ్వతమైపోతే!'

జలపాతం చేరుకున్నాము. జలపాతం పెద్దది కాకపోయినా, అట్టే ఎత్తునించి పడకపోయినా ఆ వాతావరణంలో దాన్ని చూడ్డం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. అరుణ సంతోషం చెప్ప నక్కరలేదు. పసిపిల్లలా గెంతులేసింది. ఆ నీళ్లతో ఆడుకుంది. రాళ్లు తీసి నీటిమీదికి విసిరింది. చివరికి అరుణ ఒళ్లంతా తడిసిపోయింది. నేను దూరంగా నిలుచుని అరుణనే చూస్తున్నాను. తడిసిపోయిన చీరతో నా దగ్గరకు వచ్చిన అరుణని చూసి నాకు మతి పోయింది. ఒంటినిండా అతుక్కుపోయిన చీరలోంచి ఆమె ఒంపులన్నీ బయటికి ఉరుకు

తున్నాయి. ఎప్పుడో సాలార్‌జంగ్ మ్యూజియమ్‌లో చూసిన 'తడిసిన చీరతో ఒడ్డున కూర్చున్న యువతి' పెయింటింగ్ గుర్తుకి వచ్చింది. నా మనసు నా వశం తప్పిపోసాగింది. ఇంక లాభం లేదు. ఇంత సౌందర్యాన్ని నేను ఈ జీవితంలో వదులుకో గూడదు. ఎలా అయినా అరుణని నా దాన్ని చేసుకోవాలి. నాకు వరలక్ష్మి వద్దు, మరే స్త్రీ వద్దు. అరుణ లేని జీవితం నేను గడపలేను. అరుణా! నాకు నువ్వు కావాలి. ఎన్నో అరుణతో చెపుదా మనుకున్న నేను మూగపోయి, ఏదీ చెప్పలేక అరుణ అందాన్ని తాగేసేటట్టు చూస్తున్నాను. అలా చూస్తున్న నా వేపు చూసి అరుణ ముఖం పక్కకి తిప్పేసుకుంది.

"సారీ! నే నేమైనా అసభ్యంగా ప్రవర్తించా ననుకుంటాను!" అంది. అరుణ ముఖంలో ఇందాకటి ఉత్సాహం లేదు. దైన్యం గూడు చేసుకుని ఉంది. ఛెళ్ళున కొరడాతో కొట్టినట్టయింది నాకు. బహుశా ఆమె వేపు నే నలా చూడ్డం వల్ల తను అసభ్యంగా ప్రవర్తించా ననుకుందా? లేక నేనే ఆమెవేపు అసభ్యంగా చూస్తున్నానని గుర్తు చెయ్యడానికి అలా అందా? నాకు తెలియ లేదు. కాని, ఒకటి మాత్రం తెలిసింది—నే నలా చూడ్డం అరుణకి బాధ కలిగించింది అని. ఆమెకి బాధ కలిగిందని అనిపించాక నాకూ మనసులో బాధ కలిగింది. "సరే. పోదాం, పదండి! నాది కూడా పొరపాటు ఉండి ఉండవచ్చు!" అని నడవడం మొదలెట్టాను. అరుణ నిశ్శబ్దంగా నా వెనకనే వచ్చేసింది.

ఇద్దరం జీపులో వర్క్ స్పాట్ చేరుకున్నాము. అరుణ అంత ఉత్సాహంగా ఉండకపోవడంతో నాకూ ఉత్సాహం చచ్చిపోయింది. నాయర్ పంపిన కారేజి తీసుకుని ఒక మనిషి వచ్చాడు. అతనితో భోజనం రెండు ప్లేట్లలో పెట్టమని చెప్పి కాళ్ళూ, చేతులూ కడుక్కుని చెట్టు కింద కూర్చున్నాను. అరుణ నిర్లిప్తంగా చూస్తూ నిలుచుంది. మౌనాన్ని ఛేదించడం నా వంతే అయింది. "మీకు బాగా ఆకలి వేస్తూంది కాబోలు! రండి, భోజనం చేద్దాం!" అన్నాను అరుణతో.

అరుణ బుంగమూతి పెట్టింది. "నా కక్కరలేదు" అంది.

"ఏం, కోపమొచ్చిందా?" అన్నాను.

"రాదా మరి!" అరుణ జవాబిచ్చింది.

"ఏం చేశాను నేను?" తల వంచుకునే మాట్లాడుతున్నాను నేను. బహుశా నేను ఆమెవేపు అలా తేరిపారచూడ్డం బాగులేదని చెబుతుందని అనుకున్నాను.

"నే నేం చేశానని మీ రలా ముభావంగా ఉన్నారు? అసలు ఆ జలపాతం దగ్గరినించి వచ్చిన దగ్గర్నించీ నాతో మాట్లాడుతున్నారా? మీ రన్నీ సీరియస్‌గా తీసుకుంటారు" అంది.

నాకు మనసు తేలిక పడింది.

"అది కాదు, అరుణా!"

"ఏదీ కాదు! మీరు నవ్వితేనే నే నన్నం తింటాను!"

నేను నవ్వాను.

"అలా కాదు! మీరు మనఃస్ఫూర్తిగా నవ్వాలి!"

చిన్న పిల్లలా మారాం చేస్తున్న అరుణని చూస్తే నవ్వాగలేదు. పకపకమని నవ్వాను. నా కెందుకో హృదయంలోంచి పెద్ద బరువు దించేసినట్టయింది. అరుణ భోజనానికి వచ్చి కూర్చుంది.

"మీరు చెప్పింది రైటే. మీ నాయర్ చాలా బాగా వండతాడు" అంది అరుణ.

"మరేమి టనుకున్నారు? ఈ విషయంలో ఏ ఆడవాళ్ళైనా అతని ముందు బలాదూరే!" అన్నాను.

భోజనం అయాక ఒక పావు గంట విశ్రాంతి తీసుకున్నాము. ఆ తరవాత అరుణకి వర్క్ స్పాట్‌లో దొరికిన వాటి గురించీ, తవ్వే విధానాల గురించీ ఒక గంటసేపు చెప్పాను. మధ్యాహ్నం రెండు గంట లయింది.

"ఇంక ఇక్కడ చూడవలసినవి అన్నీ అయిపోయినట్టే! ఏం చేద్దాం?" అన్నాను.

"నా కింకా నాలుగు గంటల వ్యవధి ఉంది. మీకు తీరికగా ఉంటుందా? నే నెంత సేపూ నా గురించే ఆలోచిస్తున్నాను గాని, మీ పని గురించి అసలు ఆలోచించడం లేదు" అంది అరుణ.

"నా తీరిక కేం లెండి! నే నిక్కడ లేకపోయినా ఈ పని జరుగుతూనే ఉంటుంది. అయినా ఏంచేద్దామంటారు?"

"మీ కభ్యంతరం లేకపోతే ఈ చుట్టుపక్కల ఎక్కడైనా కూర్చుని కబుర్లు చెప్పుకుందాం." అరుణకి ఎందుకో ఆ పరిసరాలు వదలా లనిపించడం లేదన్నట్టు మాట్లాడింది.

"దానికేం? పదండి! ఈ చుట్టుపక్కల ప్రదేశాలన్నీ కనిపించే చోటికి మిమ్మల్ని తీసుకువెళతాను. అక్కడ మీరు కొన్ని గంటలే కాదు, కొన్ని రోజులైనా గడుపుతారు. వెళదామంటారా?" అడిగాను.

"పదండి" అంది అరుణ.

ఇద్దరం జీపులో మళ్ళీ బయలుదేరి కొండమీదకు ఉన్న రోడ్డు వెంబడి వెళ్ళాము. ఒక ఎత్తైన ప్రదేశంలో జీపు ఆపి అడ్డదారంట ఇరవై గజాలు నడిచి కొండ అంచుకు వెళ్ళాము. అక్కడినించి చూస్తే అగాధమైన లోయ. లోయనిండా దట్టంగా అల్లుకుపోయిన పొదలు, చెట్లు. లోయకి మీదుగా నీలం ఆకాశం, చుట్టూ దూరంగా గంభీరంగా నిలుచున్న కొండలు. దృశ్యం చాలా బాగుంటుంది. అరుణ ఆ వాతావరణం చూసి ముగ్ధురాలయింది. "మీరు చెప్పింది నిజం! ఇక్కడ కొన్ని రోజులే కాదు, కొన్ని సంవత్సరాలు ఉండమన్నా ఉండేటట్లు ఉంది ఈ స్థలం. పట్నాల్లో ఆ చాలీచాలని కొంపల్లో బతుకుతూన్న వాళ్ళకి ఇక్కడి కొస్తే ప్రాణం లేచి వస్తుంది. ఇక్కడ నిలబడి ఈ ప్రకృతి వేపు ఒక్కసారి చూస్తే మానవులు భగవంతుని సృష్టిలో ఎంత అల్పులో బోధపడుతుంది" అంది అరుణ.

"మన కింకా కొన్ని గంటల వ్యవధి ఉంది. ఇక్కడ కూర్చుందా మంటారా కొంతసేపు?" అడిగాను.

"ఓ నిరభ్యంతరంగా!" అరుణ నాకు మూడడుగుల దూరంలో అతి పొందికగా కూర్చుంది. ఈమె ప్రతి కదలికలోనూ హొయలు, ప్రతి భంగిమలోనూ వినూత్నమైన అందం ఉట్టి పడుతున్నాయని అనుకున్నాను. ఇంక రెండు మూడు గంటల్లో అరుణ నన్ను విడిచి వెళ్ళిపోతుందంటే నాకు ఏదోలా ఉంది. ఈ ప్రపంచమంతా ఇంకో రెండు మూడు గంటల్లో శూన్యమై పోతున్నట్టూ, అందులో నే నొక్కణ్ణే మిగిలిపోతా నన్నట్టూ అనిపించసాగింది. మాట్లాడకుండా కూర్చున్నాను.

---

## ఆలోచన

**జీవితం నాకు ఆలోచించడం నేర్పింది. కాని, ఆలోచన నాకు జీవించడం నేర్పలేదు.**

—హెర్జన్

---

"ఏమి టలా కూర్చున్నారు? ఇలా కూర్చుంటే మనకి సమయం గడిచినట్టే! ఏమైనా కబుర్లు చెప్పండి!" అంది అరుణ.

"ఏమిటి చెప్పమన్నారు? నాకేం కబుర్లు చేతకావే?" అన్నాను. నా మనసులో ఎందుకో చెప్పరానంత దిగులుగా ఉంది. మాట్లాడ్డానికి కూడా మనస్కరించలేదు.

"మరెలా!" అంది అరుణ.

"పోనీ, మీరు చెప్పండి!" హఠాత్తుగా నా కో ఆలోచన తట్టింది. ఇంత కమ్మని కంఠస్వరం ఉన్న ఈమెకి పాటలు వచ్చి ఉండవచ్చుగా! "చూడండి, అరుణా! మీరు ఏమైనా పాటలు వస్తే పాడకూడదూ!" గబుక్కున అడిగేశాను. అరుణ తెల్లబోయింది. "సారీ!" అన్నాను.

"ఫరవాలేదు లెండి! నా కేవో పాటలు వచ్చు. కాని, వింటే మీకు బాగుండవేమో అని నా అభిప్రాయం."

"ఫరవాలేదు! మీరు ఎలా పాడినా నాకు బాగానే ఉంటాయి. రేడియోలో పాటలు విని విని విసుగెత్తింది. దయచేసి ఏమైనా పాడండి!"

అరుణ తల వంచుకుంది. చిన్నగా గొంతుక సవరించుకుంది. కింది పెదవిని నొక్కి పట్టి ఏదో ఆలోచించసాగింది. ఆమె బుగ్గల్లోకి ఎర్రటి రక్తం చిమ్మింది. ఆ మార్పు గమనించాక నాకు అనిపించింది ఒక్కటే. 'ఈ సృష్టిలో అంతటికీ అపురూపమైనదీ, అద్భుతమైనదీ స్త్రీ. స్త్రీత్వంలోని సొగసు మరెందులోనూ లేదేమో?'

అరుణ రెండు నిమిషాలు ఆగి, 'శివ శివ అని యనరాదా' అని దేవులపల్లి వారి గీతం ఎత్తుకుంది. గీతంలోని మాధుర్యం, అరుణ కంఠంలోని మార్దవం నన్ను నేను మరిచిపోయేటట్టు చేశాయి. ఆ తరవాత అరుణ 'ఏమి సేతురా లింగా' అనే ఇంకో కీర్తన పాడింది. ఆ స్వరం నన్ను ఏవో లోకాల్లోకి తీసుకు వెళ్ళింది.

అరుణ పాడటం ఆపుచేసి, "ఈ రోజెందుకో నాకు సరిగా స్వరం పలకడం లేదు. ఇంక పాడను" అంది.

"సరేలెండి! అయితే ఏం చేద్దామంటారు?" అడిగాను.

"మీరు ఏమైనా విషయాలు చెప్పండి!" అంది.

"నాకు చేతకా వన్నానుగా?" అన్నాను.

"పోనీ, మీ గురించి చెప్పండి!" అంది అరుణ.

"నా గురించా?"

"ఆఁ మీ గురించే! మీ ఇంటి గురించీ, మీ చదువు గురించీ, మీ ఊహల గురించీ."

నేను మాట్లాడలేదు.

"పోనీలెండి! నాతో చెప్పకూడని విషయాలు కాబోలు! ఎలా అయినా, స్వవిషయాలు ఎంత పరిచయమున్నా పరాయి వాళ్ళతో చెప్పరు లెండి కొందరు." అంది.

"అదేం కాదు! నాకు మీరు పరాయి వాళ్ళలా కనిపించడం లేదు. నిజం చెప్పాలంటే మీరు నా కెంతో ఆప్యాయంగా కనిపిస్తున్నారు. మీతో నా విషయాలు అన్నీ చెప్పుకోవా లనిపి

స్తూంది. కాని, నా విషయాలు వింటే మీకు విసుగెత్తదూ?"

"ఫరవాలేదు! చెప్పండి!" అంది అరుణ.

నా గురించి అన్ని విషయాలూ అరుణకి చెప్పేశాను. చివరికి వరలక్ష్మి గురించి కూడా చెప్పాను. అంతా విని అరుణ మాట్లాడకుండా కూర్చుంది.

"ఏమిటలా ఆలోచిస్తున్నారు? నా విషయాలు మీకు బోర్ కొట్టలేదు కదా?" అడిగాను.

"లేదు! నే ననుకుంటూన్నది ... వరలక్ష్మిని మీరు పెళ్ళిచేసుకుని ఉండాల్సింది అని" అంది అరుణ. నాకు కోపం వచ్చింది. ఆవేశం కలిగింది.

"ఏం, ఎందుకని? వరలక్ష్మి అందగత్తె కావచ్చు! కాని, జీవితంలో చైతన్యం కలగజేసే వ్యక్తి కాదు, అరుణా! ఏ భావాలూ లేకుండా, ఏ చలనమూ లేకుండా బండ రాళ్ళలా జీవితం గడపలేను నేను. బండ రాళ్ళలో బతుకుతున్నానని నన్నూ బండ రాయి అవమంటారా?"

అరుణ నా ముఖంలోకి ప్రసన్నంగా చూసింది.

"చూడండి, మిస్టర్ సారథీ! నే నో ప్రశ్న అడుగుతాను, జవాబు చెపుతారా?" అంది.

"అడగండి" అన్నాను.

"నిన్నటి వరకూ మీ జీవితం ఎలా ఉంది ఇక్కడ?"

"బండరాయిలాగానే కదలిక లేకుండా ఉంది."

"ఈ రోజు ఎలా గడిచిం దంటారు?"

"ఈ రోజుకేం? చాలా బాగా గడిచింది. నా జీవితంలో గుర్తుండే ముఖ్యమైన రోజుల్లో ఇదొకటి అనుకుంటా."

"దీనికి కారణ మెవ రంటారు?"

"మీరే! మీవల్నే ఈ రోజు నాలో కొత్త చైతన్యం కలిగించింది."

"మరి ఇంకొక ప్రశ్న అడుగుతాను, సమాధానం చెప్పండి! ఇంత స్తబ్దంగా జీవితం గడిపే మీలో ఈ ఒక్క రోజులో నేను చైతన్యం కలిగించినప్పుడు, అదే విధంగా స్తబ్దంగా జీవితం గడుపుతూన్న వరలక్ష్మి జీవితంలో మీరు చైతన్యం ఎందుకు కలిగించలేదు?"

నేను సమాధానం చెప్పలేకపోయాను.

"పదండి, పోదాం!" అంది అరుణ లేచి. సమయం అయిదు గంట లయింది. జీపులో ట్రావెలర్స్ బంగళా వేపు బయలుదేరాము.

జీపు బంగళా చేరగానే అరుణ కిందికి దిగింది. ఆమెని ఒక ప్రశ్న అడగాలని నా మనసు ఆరాటపడుతూంది. ఎలా అడగాలో తెలియక సందిగ్ధంలో పడ్డాను. అరుణ నా అవస్థని కనిపెట్టింది కాబోలు చిన్నగా నవ్వి ఇలా అంది:

"మిస్టర్ సారథీ! మీ కో విషయం తరవాత చెపుతానని పొద్దున్న అన్నాను, గుర్తుందా? అది ఇప్పుడు చెబుతున్నాను, వినండి! నాకు పెళ్ళయి రెండేళ్ళయింది. ఇంకో గంటలో మా వారు కారులో వచ్చి ఇక్కడ నన్ను రిసీవ్ చేసుకుంటామని చెప్పారు. ఆయన ఈ పక్క పల్లెటూళ్ళో ఏదో పనిమీద వెళ్ళారు. పని అయిపోతే ఆరింటిలోగానే వస్తామన్నారు. మీరు నా ఎడల చాలా శ్రద్ధ చూపించారు. అందుకు నా థాంక్స్!" అరుణ ముఖం మీద చిరునవ్వు చిందులాడసాగింది. ఆ నవ్వుని చూస్తే నా కిప్పుడు సంతోషం కలగలేదు. కోపం వచ్చింది. కాని, కోపాన్ని మనసులోనే అణచిపెట్టుకుని, "మరి ఎందు కింత రహస్యంగా దాచారు ఆ విషయం?" అని అడిగాను. అరుణ— "ఎందుకంటే దానికి కారణ ముంది! నా జవాబు ఇచ్చేముందు మిమ్మల్నే ప్రశ్న అడుగుతాను, వినండి! నేనే ఒకవేళ వివాహ మయిందని చెప్పి ఉంటే నాతో మీ రింత స్వేచ్ఛగా, చనువుగా మసిలేవారా? ఇంత ఉత్సాహంగా ఈ రోజు గడిపేవారా? చెప్పండి" అంది.

నేను తల వంచుకున్నాను. అవును! అరుణ చెప్పింది నిజం. ఒక వేళ అరుణే పెళ్ళయిందని చెప్పి ఉంటే నేను బహుశా అన్ని చోట్లకీ ఆమెతో వెళ్ళి ఉండేవాడిని కాదేమో! ఎవరికయినా ఆమెని అప్పజెప్పి, అన్నీ చూసిరమ్మని పంపేవాడిని. అప్పుడు ఈ రోజు కలిగిన ఆనందం అంతా నాకు ఉండేది కాదు. ఈ ముఖ్యమైన రోజు నా జీవితంలో అసలు ఉండేది కాదు.

అరుణ మళ్ళీ ఇలా అంది: "జీవితం పూలపాన్పు చేసుకోవడం ముళ్ళ పాన్పు చేసుకోవడం—అంతా మన చేతుల్లోనే ఉంది, మిస్టర్ సారథీ! సాధ్యమైనంతవరకూ మన ఆనందాన్ని ఇతరులకి పంచిపెట్టినప్పుడే మన జీవితం సార్థక మవుతుంది. మనం అలా చెయ్యకపోగా అవతలి వాళ్ళు మన కానందం కలిగించడం లేదని మనం అనుకోవడం అజ్ఞానం..." అరుణ నా గురించే చెబుతూందని నాకు తెలుసు. కాని, నా మనసులో ఒక్క సందేహం మాత్రం మిగిలిపోయింది. అదే అరుణని అడిగాను.

"మీరు చాలా తెలివైన వారు, సంస్కార వంతులు—కాని మీ రిలా ..."

నా ప్రశ్న పూర్తి కాకుండానే అరుణ ఆపుచేసింది.

"అర్థమయింది లెండి! నేను రోజల్లా మీతో ఇలా తిరిగానని మా వారు ఏమీ అనుకోరా అని మీ సందేహం? అవునా?" అని కొంచెంసేపు ఆగి, "ఆ విషయంలో నేను చాలా అదృష్టవంతురాలిని. మీరు నాలో చూసిన సంస్కారానికి పదిరెట్లు సంస్కారం మా వారిలో ఉంది. అందుకే మా జీవితాలు ఇంతవరకూ ఏ ఒడిదుడుకులు లేకుండా గడిచిపోతున్నాయి... ఆ అదుగో కారు హారను వినిపిస్తూంది. నేను వెళతాను, గుడ్‌బై!" అని అరుణ కారు హారను వినిపించిన వేపు పరిగెట్టింది. నేను ఈ లోకంలో పడ్డాను.

రూముకి వెళ్ళి బట్టలు మార్చుకోకుండానే కుర్చీలో కూలబడ్డాను. మన సంతా గజిబిజిగా ఉంది. ఇన్నాళ్ళూ నే నేదో భ్రమలో ఉండిపోయాను. వరలక్ష్మిని కాదని అమూల్యమైన రెండు సంవత్సరాల కాలం నా జీవితంలో వ్యర్థం చేసుకున్నాను. అరుణ వచ్చి నా కళ్ళు తెరిపించింది. ఇంక ఆలస్యం చెయ్యకూడదు. సూర్యంమామయ్యకి ఈ రోజే ఉత్తరం రాసెయ్యాలి. ముందు వేడి వేడి కాఫీ తాగాలి. "నాయర్" అని పిలవబోయాను. నాయర్ వేడి వేడి కాఫీ పట్టుకుని వచ్చి నా చేతి కిచ్చాడు. రెండు కవర్లు ఎదురుగా స్టూల్ మీద పెట్టాడు. అందులో ఒక కవరుమీద దస్తూరి పోల్చుకో గలిగాను. సూర్యం మామయ్య రాసిన ఉత్తరం అది. అది చదవకుండానే రెండో కవరు చింపాను. అందులో పెళ్ళి శుభలేఖ ఒకటి ఉంది. దాని ఎడమవేపు నలుచదరపు గడిలో ఉన్న 'వరలక్ష్మి అను కన్యను ఇచ్చి' అనే అక్షరాలు మాత్రం చూశాను. సూర్యం మామయ్య రాసిన ఉత్తరం మరి నేను చదవలేదు. కిటికీ దగ్గిరికి వెళ్ళి నిలుచున్నాను. ఎర్రటి సూర్యబింబం కొండ వెనక్కి దిగిపోతూ అరుణ కాంతులు చిమ్ముతూంది. మరి కాసేపటికి బింబం పూర్తిగా దిగిపోయింది. వెలుగు జారిపోయింది. ★

